క్లుప్తంగా

మహా శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి పురస్కరించుకుని బుధవారం తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ముక్కంటి ఆలయంలో ఏర్పాట్లను, పలు ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలను పర్యవేక్షించాలని పోలీసులను ఆదేశించారు. మహిళలు, పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి తోపులాటలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. అనంతరం కమాండ్ కంట్రోల్‌రూమ్ నుంచి పర్యవేక్షిస్తూ అధికారులకు మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి, ట్రైనీ ఎస్పీ హేమంత్, అదనపు ఎస్పీలు రవి మనోహ రాచారి, రామకృష్ణ, డీఎస్పీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటిని దర్శించుకున్న ప్రముఖులు



గోపూజ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దంపతులు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తన సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డితో కలిసి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. తొలుత బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆలయ ఆవరణలో గోపూజ చేశారు.పాలక మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు పగడాల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో స్కౌట్ సేవలు



కైలాసనాథ కోనలో సేవలందించిన స్కౌట్ విద్యార్థులు

నారాయణవనం: శివరాత్రి పర్వదినం సందర్భంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాల స్కౌట్ విద్యార్థులు సేవలను అందించి భక్తుల మన్ననలు పొందారు. మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసనాథకోనతో పాటు టీటీడీ అనుబంధ పరాశురేశ్వర, అగస్త్యేశ్వర ఆలయాల్లో బుధవారం వేకువ జామున నుంచే స్కౌట్ విద్యార్థులు సేవలను అందించారు. క్యూల నియంత్రణ, వృద్ధులకు, దివ్యాంగులకు ఆసరాగా నిలబడ్డారు. అన్న ప్రసాదాల వితరణ కేంద్రాల వద్ద తొక్కిసలాటలు లేకుండా సేవలను అందించారని బాలుర ఉన్నత పాఠశాల పీడీ, స్కౌట్ ఇన్‌చార్జి జయప్రకాష్ తెలిపారు. భక్తుల రద్దీలో విద్యార్థుల సేవలను అభినందించారు.

పోటెత్తిన భక్తులు



భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్లు ఇస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి :మహాశివరాత్రి సందర్భంగా ముక్కంటి ఆలయానికి బుధవారం వేకువజాము 2 గంటల నుంచే భక్తులు పోటెత్తారు. వాయులింగేశ్వరుడు నిజమూర్తి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. గతంలో లాగే మహా లఘు దర్శనం ఏర్పాటు చేశారు. శేష వాహనం ఆలయంలోకి రాకముందే గోపూజ నిర్వహించడం విమర్శలకు తావిచ్చింది. ప్రత్యేకంగా అలంకరించిన గోవు స్వామి, అమ్మవార్లను మొదట దర్శించుకుంది. సుప్రభాత సేవ తర్వాత మూడు గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. రాజగోపురం సమీపం నుంచి సామాన్య భక్తుల కోసం ఉచిత దర్శనానికి టికెట్టు రెండు క్యూలను ఏర్పాటు చేశారు. ఆలయం లోపల మహా లఘుదర్శన విధానం అమలు చేశారు. స్వర్ణముఖిలో తర్పణాలు విడిచేందుకు ఏర్పాట్లు చేశారు. క్యూలలో భక్తులకు తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు అందజేశారు.

నారాయణవనం: అలంకరణలో కైలాసనాథస్వామి



రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : హాజరైన భక్తులు, శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు





నారాయణవనం: కైలాసనాథునికి వస్త్ర సమర్పణలో ఎమ్మెల్యే ఆదిమూలం





బుచ్చినాయుడుకండ్రిగ : గాజుల పెళ్లూరులో పూజలు చేస్తున్న భక్తులు



పిచ్చాటూరు: పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీ వాలీశ్వర స్వామి

శుభకరం..శివనామ స్మరణం





వరదయ్యపాళెం: జ్యోతీశ్వరాలయంలో మొదటి కాల పూజలు అందుకుంటున్న స్వామివారు , నాగలాపురం: వృషభ వాహనంపై స్వామి అమ్మవార్లు

వరదయ్యపాళెం: మహాశివరాత్రి పురస్కరించుకుని బుధవారం మండలంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం 5 గంటల నుంచే భక్తులు పోటెత్తడంతో ఆలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు చేశారు. ఆ మేరకు మండలంలోని శ్రీ జ్యోతీశ్వరాలయం, అరుదూరులోని శ్రీ కాళహస్తీశ్వర సమేత శ్రీ జ్ఞానప్రసూనాంబికా దేవి ఆలయం, వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయం, వెంకటరెడ్డికండ్రిగలోని ఉమామహేశ్వర ఆలయం, సంతవేలూరులోని శ్రీ కామాక్షిదేవి సమేత వాలీశ్వరస్వామి ఆలయం, ఉబ్బలమడుగులోని సిద్ధేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడాయి.

జ్యోతీశ్వరాలయానికి పోటెత్తిన జనం

పురాతనమైన జ్యోతీశ్వరాలయానికి నాలుగు కాల పూజలు, లింగోద్భవ అభిషేకాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు నిరంజనాచార్యులు పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు స్థానిక ఎంపీటీసీ సామర్ల భువనేశ్వరి, హరి దంపతులు లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

వరదయ్యపాళెంలో..

మండల కేంద్రంలోని త్రయంబకేశ్వరాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామి అమ్మవార్లకు చేపట్టిన ప్రత్యేక పుష్పాలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. వరదయ్యపాళెం పరిసర ప్రాంతాల నుంచి వందలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మవార్ల దర్శనం చేపట్టారు. ఆలయ అర్చకులు రాజేంద్రప్రసాద్ శర్మ పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

ఉబ్బలమడుగులోని సిద్ధేశ్వరాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

సంతవేలూరులోని శ్రీ కామాక్షిదేవి సమేత వాలీశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త మాయాని శేఖర్ రెడ్డి, చెంచులక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో వైభవోపేతంగా పూజలు జరగగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి దర్శనం చేసుకున్నారు.

ఉమామహేశ్వర స్వామికి రుద్రాభిషేకం

సత్యవేడు: మండలంలోని ఇరుగుళం పంచాయతీలో ఉన్న శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, విశేష ద్రవ్యాభిషేకం, పంచామృతాభిషేకం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ దంపతులు, భానుప్రకాష్ దంపతులు, బీరేంద్రవర్మ స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం 4 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా సాగింది. రాత్రి 9గంటలకు గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీ వెంకటాద్రి భక్త సమాజం, శ్రీ నివాస భక్త సమాజం, శ్రీ తిరు వెంకటరామానుజ భక్త సమాజం భజనలు, కోలాటం, నగర సంకీర్తనలు నిర్వహించారు.

పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవాలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కుల్ ఆలయంలోని పరివార దేవతలకు అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ అధికారులు సూపరింటెండెంట్ హిమత్ గిరి, దఫేదారు గిరిధర్ నాయుడు, స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన పుష్ప అలంకరణ, విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ రకాల ప్రసాదాలు, అన్నదానం భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లను వృషభ వాహనంపై అధిష్ఠింపచేశారు. నక్షత్ర హారతి, కుంభ హారతి, మహా హారతులు చేపట్టారు. మంగళ వాయిద్యాలు, కోలాటాల నడుమ వృషభ వాహనంపై స్వామి అమ్మవార్లు తిరువీధుల్లో విహరించారు. ఈ వాహన సేవకు పళ్లికొండేశ్వర స్వామి మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏవీఎం మునిశేఖర్ రెడ్డి (బుజ్జి రెడ్డి) కుటుంబ సభ్యులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఆలయ ప్రాంగణంలో భరతనాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

రామగిరిలో అభిషేక పూజలు

పిచ్చాటూరు మండలం రామగిరిలోని శ్రీ వాలీశ్వర స్వామి ఆలయంలో అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శంకర్ గురుక్కల్ శాస్త్రోక్తంగా మూలవిరాట్ శ్రీ వాలీశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకించి, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉభయదారులుగా పిచ్చాటూరు మండలం గోవర్ధనగిరికి చెందిన మాజీ ఎమ్మెల్సీ కుందేరి జయచంద్ర నాయుడు, వారి కుటుంబ సభ్యులు, ఏవీఎం మునిశేఖర్ రెడ్డి(బాలాజి రెడ్డి) వ్యవహరించారు.

కిటకిటలాడిన శివాలయాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు, కాంపాళెం, పెద్దపాలేడు, గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గాజులపెళ్లూరులోని శివాలయంలో గ్రామస్తులు శివ పార్వతులకు అభిషేకాలు చేసి, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు.

భక్తి శ్రద్ధలతో మహాశివరాత్రి

నారాయణవనం: మండలంలోని టీటీడీ అనుబంధంగా ఉండే చంపకవల్లీ సమేత పరాశరేశ్వర, మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయాలతో పాటు కైలాసకోన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అర్చకులు, స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు నిర్విరామంగా అన్నప్రసాదాలను అందజేశారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ వారి హరికథా కాలక్షేపాలను ఏర్పాటు చేశారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దేవదాయ శాఖ తరపున కైలాసనాథునికి పట్టువస్త్రాలను సమర్పించి దర్శించుకున్నారు. అగస్త్యేశ్వరస్వామి, కైలాసనాథుని ఆలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి మహన్యాస పూర్వక లింగోద్భవ అభిషేకాన్ని నిర్వహించారు. కైలాసనాథ కోనలో రాత్రి బస చేసే వారి కాలక్షేపానికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఈవో కృష్ణానాయక్ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు ఆలయంలో కామాక్షాంబిక సమేత కైలాస నాథునికి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



సత్యవేడు: ఇరుగుళంలోని ఉమామహేశ్వరస్వామిని దర్శించుకొన్న నూకతోటి రాజేష్ దంపతులు

నేత్రపర్వం..కల్యాణోత్సవం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం గాజులమండ్యంలో స్వర్ణముఖి నదీ తీరాన స్వయంభుగా వెలసిన శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి అమ్మవారి మూల విరాట్లకు విశేష అభిషేక పూజలు చేశారు. అనంతరం పట్టువస్త్రాలు, సకల ఆభరణాలతో దివ్య అలంకార శోభితులై శ్రీ కామాక్షి దేవి, మూలస్థానేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు విశేష పుష్పాలతో అలంకరించి కళ్యాణ మండపానికి వేంచేపు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దక్షిణామూర్తి స్వామి ఆధ్వర్యంలో వేద పండితులు మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల శివనామ స్మరణ నడుమ ఆది దంపతుల కళ్యాణ మహోత్సవాన్ని ఆద్యంతం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఉభయదారులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, సారెను సమర్పించారు. కళ్యాణోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. భక్తుల శివనామస్మరణతో మారుమోగింది. తదుపరి ముత్తైదువులకు అర్చకులు ఆశీర్వచనం పలికి పసుపు కుంకుమ అందజేశారు. అనంతరం ఉభయదారులు భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ నిర్వాహకులు జువ్వల ధనంజయ రెడ్డి ఆధ్వర్యంలో మూలస్థానేశ్వర ఆలయం, ఆలయ ప్రాంగణంలో విశేష ఫల, పుష్పాలంకరణలు భక్తులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది. గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శివరాత్రి వేడుకలు



నీలకంఠేశ్వరస్వామి దర్శించుకుంటున్న ఎంపీపీ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తుల శివనామస్మరణతో రేణిగుంట మండలంలోని శైవ క్షేత్రాలు మార్మోగాయి. అమ్మవారి పట్టెడలోని పురాతన శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో విశేష అభిషేక పూజలు చేసి ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే, రేణిగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలోని శివాలయం, గంగమ్మ గుడి శివాలయం, శ్రీ కరుమారియమ్మ ఆలయ ఆవరణలోని శివాలయంలో 108 పాల కలశాలతో అభిషేకం చేశారు. శ్రీకాళహస్తి రోడ్డులోని శివాలయం, గురవరాజుపల్లె శ్రీ మహదేవ శివకేశవ ఆలయం, రామకృష్ణాపురం మునీశ్వర ఆలయాలు, బుగ్గ కొలనులో ప్రత్యేక పూజలు చేశారు. వెదళ్ల చెరువులోని శ్రీ ఓంకార జ్యోతి లింగేశ్వరస్వామి ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. సాయంత్రం శివనామ సంకీర్తనల కచేరి నిర్వహించారు. వివిధ ఆలయాల్లో భక్తులతోపాటు ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు కూడా స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలతో పడి ఉన్న ధర్మ

రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట–తిరుపతి ఫ్లైఓవర్‌పై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. రేణిగుంట పోలీసుల కథనం... రేణిగుంటలోని జ్యోతినగర్‌కు చెందిన ధర్మ(61) రోడ్డు దాటుతుండగా, గుర్తు తెలియని ఆటో ఢీకొంది. దీంతో ఆయన తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. రేణిగుంట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శంభో శంకరా..!



ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరుడు

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలంలోని శివాలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. గుడిమల్లంలోని శ్రీ ఆనందవల్లీ సమేత పరశురామేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. ఆలయాన్ని రంగురంగుల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం ఉదయం నాలుగు గంటలకే నిర్వహించారు. పల్లకి సేవ శాస్త్రోక్తంగా జరిపారు. రాత్రి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు దాతలు అన్న సంతర్పణ చేశారు. మండలంలోని చిందేపల్లెలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, నవచండీ యాగ హోమ పూజలు, కల్యాణోత్సవం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ముసలిపేడు సమీపంలోని బత్తినయ్య కొండపై ఉన్న భక్తకంఠేశ్వరుని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అలాగే పాయిల్ సెంటర్ సమీపంలోని సదాశివకోనకు వెళ్లే భక్తులకు స్థానికులు అన్నదానం, తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. నాగంపల్లె అడవుల్లోని మహానందీశ్వరస్వామి ఆలయంలో గణపతి హోమం కలశపూజ, నవగ్రహ మృత్యుంజయ హోమం, రుద్రాభిషేకం నిర్వహించారు. పాపానాయుడుపేటలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. దాసరి యువజన సమాఖ్య ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఇక, ఏర్పేడు లోని శివాలయాన్ని భక్తులు దర్శించుకున్నారు.

శ్రీసిటీలో జాతీయ భద్రతా వారోత్సవాలు ప్రారంభం



వారోత్సవాలు ప్రారంభిస్తున్న సతీష్ కామత్

శ్రీసిటీ (వరదయ్యపాళెం): జాతీయ భద్రతా వారోత్సవాలు బుధవారం శ్రీసిటీలో ప్రారంభమయ్యాయి. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ జెండా ఊపి లాంఛనంగా వారోత్సవాలను ప్రారంభించారు. ఆయన శ్రీసిటీ సిబ్బంది, స్థానికులకు కార్యక్రమం ప్రాధాన్యత గురించి వివరించారు. వారిచే భద్రతా ప్రమాణాలపై ప్రతిజ్ఞ చేయించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, ప్రమాదాలు నివారించడానికి భద్రతా అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని తెలిపారు. పని జరిగే ప్రదేశాల్లో అధిక శాతం ప్రమాదాలు అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్ల సంభవిస్తాయన్నారు. దీనిని నివారించేందుకు శ్రీసిటీ, పరిశ్రమల యాజమాన్యాలు కలిసి తరచూ తమ ఉద్యోగులు, కార్మికులకు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (ప్రాజెక్ట్స్) ఎస్.శేఖర్, సెక్యూరిటీ, విజిలెన్స్ హెడ్ వై. రమేష్ కుమార్ పాల్గొన్నారు.

చేనేతలను ఆదుకోరూ!

శ్రీకాళహస్తి: రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగాన్ని అభివృద్ధి చేసి కార్మికులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం చేనేత కార్మి యూనియన్ క్యాలెండర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో జగనన్న ప్రభుత్వం చేనేత రంగాన్ని ఆదుకున్నారని, అదే రీతిలో ప్రస్తుత ప్రభుత్వం కూడా తోడ్పాటునివ్వాలని కోరారు, ఆప్కోను బలోపేతం చేసి సహకార రంగాలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో చేనేత యూనియన్ నాయకులు సుధాకర్ , రాష్ట్ర దేవాంగ యువజన సంఘం అధ్యక్షులు పులి రామచంద్రయ్య, దేవిక, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తిలో బుధవారం పలువురు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఏపీ సీడ్స్ కూడలి వద్ద మప్పేటి నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. మధురెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇక, యంగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, గౌడ సంక్షేమ సంఘం తదితర సంఘాలు సైతం భక్తులకు అన్నదానం చేశాయి.



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పుష్ప (పుష్ప నృత్యాలయం–తిరుపతి) నృత్య ప్రదర్శనతో బుధవారం సాంస్కృతిక కార్యక్రమాలు మొదలయ్యాయి. అనంతరం పట్టణానికి చెందిన సుదీక్ష, ఇషితశ్రీ, ఆశ్రి, అరుణ నృత్య ప్రదర్శనలు చేశారు. తిరుపతికి చెందిన డాక్టర్ శాఖమూరి రవి చంద్రబాబు ప్రవచనం చేశారు. ఇక పట్టణానికి చెందిన తనూజ, రూపచందన, సరయు, మోక్షతో పాటు మనస్విని, బొజ్జల భవ్య, బెంగళూరుకు చెందిన లాస్య నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజయవాడకు చెందిన కోదండరామయ్య భక్తిరంజనితో ఓలలాడించారు. నెల్లూరుకు చెందిన విఘ్నేశ్వర కళాసమితి ప్రదర్శించిన బాలనాగమ్మ, పల్లంపేటకు చెందిన సాయిబాబా నాట్యమండలి 'రామాంజనేయ యుద్ధం' నాటక ప్రదర్శనతో భక్తులను అలరించాయి.